సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం, 23, సెప్టెంబర్, 2023



పెండింగ్ ఫీజులు ఇవ్వండి

సిరిసిల్లటౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన దీక్ష చేపట్టారు.



అసంక్రమిత వ్యాధులపై అవగాహన

సిరిసిల్లటౌన్: అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎన్‌సీడీపై అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులకు న్యాయం దక్కాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



కోనరావుపేట(వేములవాడ): ఎన్నికలు, పండుగల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం దాక్కలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేసిన సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్లకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం ఉండాలన్నారు. పాతనేరస్తులు, అనుమానితులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌పై దృష్టి పెట్టాలన్నారు. రిసెప్షన్, జీడీ ఎంట్రీ రిజిష్టర్లను పరిశీలించారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు ప్రారంభం



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు డీలక్స్ బస్సును స్థానిక బస్టాండ్‌లో శుక్రవారం రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వేములవాడ నుంచి డీలక్స్ బస్సు ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాత్రి 9 గంటలకు చేరుకుంటుందన్నారు. మళ్లీ మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వేములవాడకు 10 గంటలకు చేరుకుంటుందని వివరించారు. ఒక్కరికి టికెట్ రూ.500 ఉంటుందని తెలిపారు. ఎస్టీఐ వర్జిలాల్, రామచందర్, సత్యనారాయణ, రాంరెడ్డి, శిరీష, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఈవో కృష్ణప్రసాద్ వివిధ శాఖల అధికారులను కోరారు. చైర్మన్ చాంబర్‌లో శుక్రవారం రూ.72 లక్షల పనులకు టెండర్లు నిర్వహించారు. ఏఈవో హరికిషన్, పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్, సిబ్బంది రవీందర్‌రెడ్డి, మహేశ్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్ల బదిలీ

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో నాయబ్ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్‌ను ముస్తాబాద్‌కు, ముస్తాబాద్ నాయబ్ తహసీల్దార్ సురేశ్‌ను ఎల్లారెడ్డిపేటకు బదిలీ చేశారు. చందుర్తి నాయబ్ తహసీల్దార్ లీలారాణిని వేములవాడ రూరల్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. వీరు సోమవారం నాటికి విధుల్లో చేరనున్నారు.

నిధులు మళ్లింపు నిలిపివేత

వేములవాడ: రాజన్న ఖాతా నుంచి కామారెడ్డి జిల్లాలోని ఆలయాలకు తరలించే రూ.5 కోట్ల నిధుల మళ్లింపుని నిలిపివేస్తున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవించగా.. దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి నిధుల మళ్లింపు నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

మంత్రి కేటీఆర్‌తో వేములవాడ నేతల భేటీ



వేములవాడ: రానున్న ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే దిశగా వేములవాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌లతో భేటీ అయిన వేములవాడ నాయకులు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. త్వరలోనే వేములవాడలో మండలాలవారీగా ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుందని నిర్ణయించారు.

ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- సాదాసీదాగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- నివేదికలు చదివిన జిల్లా అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: జిల్లాలో వ్యవసాయ అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై యువత దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం దసరా నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందిస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను ప్రజలకు దరిచేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. జిల్లాలో దళితబంధు పథకం దళితుల జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపిందన్నారు. బీసీలకు, మైనార్టీలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో భరోసా ఇస్తుందని వివరించారు. ఈ సమావేశంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, జెడ్పీటీసీలు చీటి లక్ష్మణ్‌రావు, నాగం కుమార్, గుండం నర్సయ్య, గట్ల మీనయ్య, గుగులోత్ కళావతి, పూర్మాణి మంజుల, కొమిరిశెట్టి విజయ, కత్తెరపాక ఉమ, యేశవాణి, ఎంపీపీలు జనగామ శరత్‌రావు, పిల్లి రేణుక, పడిగెల మానస, బండ మల్లేశ్‌యాదవ్, మాలోత్ భూలా, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంతా మొక్కుబడి

జెడ్పీ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. అరగంట ఆలస్యంగా ప్రారంభించారు. ప్రజాసమస్యలు ప్రస్తావించకుండానే సభ సాగింది. జిల్లా అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ప్రజాసమస్యల ఊసు లేకుండానే ముగిసింది.

భూములు కేటాయిస్తాం



ప్రజా అవసరాలకు భూములు కేటాయిస్తాం. సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదించిన భూములను కేటాయిస్తాం. ప్రభుత్వ శాఖల అధికారులు విద్యుత్ బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో విద్యుత్‌లైన్లకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే చెల్లించాం. బిల్లులు మంజూరుకాగానే 'సెస్' సంస్థకు చెల్లిస్తాం.

– ఎన్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్

విద్యుత్ బకాయిలు చెల్లించండి



జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు రూ.92 కోట్ల మేరకు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వాటిని చెల్లిస్తే కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేసుకుని మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం. రెండు గ్రామాలకు ఓ సబ్‌స్టేషన్ నిర్మిస్తాం. కొత్త సబ్‌స్టేషన్లకు భూమి కేటాయించాల్సి ఉంది.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్

రోడ్డు లేదు.. ఆట స్థలం లేదు



హన్మాజీపేటలో పీహెచ్‌సీని నిర్మించారు. దానికి రోడ్డు లేదు. రోడ్డు వేయాలని చాలా సార్లు కోరినా పట్టించుకోవడం లేదు. రోగులు వచ్చిపోయేందుకు ఇబ్బందిగా ఉంది. మొరం పోసి రోడ్డు వేయాలి. మర్రిపల్లి స్కూల్‌లో చాలా మంది పిల్లలు ఉన్నారు. కానీ వారికి ఆట స్థలం లేదు. స్కూల్ పిల్లలకు ఆట స్థలం సమకూర్చాలి.

– బండ మల్లేశ్‌యాదవ్, ఎంపీపీ, వేములవాడ

ఏఎన్‌ఎంలను నియమించండి



ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంల కొరత ఉంది. ఖాళీలను భర్తీ చేసి ప్రజలకు వైద్యసేవలు అందేలా చూడాలి. కనీసం ఇద్దరినైనా నియమిస్తే కొంతమేరకు వైద్యం అందుతుంది. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భర్తీ చేయండి.

– పిల్లి రేణుక, ఎంపీపీ, ఎల్లారెడ్డిపేట

డబుల్ ఇళ్ల కాలనీలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో వసతులు కల్పించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. గంభీరావుపేటలోని బీసీకాలనీలో 168, ఎస్సీకాలనీలో 104, లింగన్నపేటలో 50, నర్మాలలో 30, కోళ్లమద్దిలో 17 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రోడ్లు, మంచినీరు, విద్యుత్‌లైన్ల వంటి వసతులు కల్పించాలన్నారు.

మోడల్ లేఅవుట్ ప్లాట్లను..

పెద్దూరు వద్ద చేపట్టిన మోడల్ లేఅవుట్ ప్లాట్లను వేలానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మోడల్‌కాలనీలో బీటీ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ లైన్లు, ప్లాంటేషన్ వసతులు కల్పించాలన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

ధరణిలో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ కోరారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం అన్ని మండలాల తహసీల్దార్లతో మాట్లాడారు. ఆఫ్‌లైన్‌లో వచ్చిన ఓటరు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. మీసేవ ద్వారా వచ్చే అన్ని రకాల దరఖాస్తులను క్లియర్ చేయాలని ఆదేశించారు.

వెంటనే పరిష్కరిస్తాం

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో సమస్యల వెల్లువ
- పరిష్కరిస్తామన్న కమిషనర్ అన్వేశ్



వేములవాడ: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ అన్వేశ్ హామీ ఇచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, ప్రజారోగ్యం, రోడ్లు, డ్రెయినేజీల సమస్యలపై 'ఫోన్‌ఇన్' నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి ఆదరణ లభించింది. తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని నోట్ చేసుకుని పరిష్కరిస్తామన్నారు.

సమస్య : ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతుంది. పాములు తిరుగుతున్నాయి. కాలనీల్లో పిచ్చిమొక్కలు తొలగించండి. డ్రెయినేజీలు శుభ్రం చేయడం లేదు.

– ఫహాద్–సాయినగర్, గౌరీశంకర్–శివసాయినగర్, గడప కిశోర్‌రావు–విద్యానగర్, గుడిసె సదానందం–శాత్రాజుపల్లి, ఎండీ అసద్, రెండో బైపాస్‌రోడ్డు

కమిషనర్ : స్థల యజమానులను గుర్తించి నోటీస్‌లు ఇస్తాం. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలను తొలగించి చెత్తలేకుండా చూస్తాం. డ్రెయినేజీలు శుభ్రం చేయించి, బ్లీచింగ్‌చేయిస్తాం.

సమస్య : కట్టకింద బస్టాండు ప్రాంతంలో బెల్లం, గోశాలకు చెందిన చెత్త, రోడ్డు విస్తరణ పనులతో ఇబ్బందిగా ఉన్నాయి.

– బి.మహేశ్, జాత్రాగ్రౌండ్

కమిషనర్ : త్వరలోనే ఆలయ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

సమస్య : వ్యాపారులు ఫుట్‌పాత్ దాటి రోడ్లపైనే సామగ్రి పెడుతుండడంతో ఇబ్బంది పడుతున్నాం.

– కొండబత్తిని శ్రీనివాస్, పాపన్నచౌక్

కమిషనర్ : పాపన్నచౌక్, మల్లారంజంక్షన్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటాం.

సమస్య : వివిధ వ్యర్థాలను రోడ్లపైనే పడేస్తున్నారు. చెత్తబండి రావడం లేదు.

– సతీశ్, రామమందిరంవీధి, గాయత్రి–గాంధీనగర్

కమిషనర్: శానిటేషన్ సిబ్బంది నిరంతరం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. భక్తులకు, స్థానికులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

సమస్య : సాయిరక్ష దాబా వద్ద వీధిలైట్లు లేక చీకటిగా ఉంటుంది. అక్కడ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి.

– యామ తిరుపతి, అడ్వకేట్

కమిషనర్ : ఆ జంక్షన్‌ను డెవలప్‌మెంట్ చేస్తున్నాం. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తాం.

సమస్య: రోడ్లపై దుమ్ము భరించలేకపోతున్నాం.

– సయ్యద్ అలీ, తిప్పాపూర్, – కృష్ణారెడ్డి, సెస్ ఆఫీస్

కమిషనర్: రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం. రెండు రోజుల్లో ఇబ్బందుల్లేకుండా చూస్తాం. సెస్ ఆఫీస్ ఏరియాలో ధ్వంసమైన రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి మరమ్మతు చేయిస్తాం. ఫుట్‌పాత్ పనులు చేస్తుండడంతో దుమ్ము లేస్తుంది. చర్యలు తీసుకుంటాం.

సమస్య : మల్లారం జంక్షన్ వద్ద బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్నాం.

– బిల్ల కృష్ణ, మార్కండేయనగర్

కమిషనర్ : ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా చొరవ తీసుకుంటాం.

సమస్య : తిప్పాపూర్‌లో మిషన్ భగీరథ వాటర్ రావడం లేదు. ఆకాశగంగం పైపులైన్ కూడా సరిగ్గా పనిచేయడం లేదు.

– మమతాసాగర్‌రెడ్డి–తిప్పాపూర్, సుదర్శన్–ఉప్పుగడ్డవీధి, మధు మహేశ్–బ్రాహ్మంగారివీధి

కమిషనర్ : చాలా ప్రాంతాలకు అగ్రహారం నుంచే నీటిని సరఫరా చేయాల్సి వస్తుంది. నిధులు మంజూరుకాగానే పనులు చేపట్టి ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా కృషిచేస్తాం. ఆకాశగంగ పైప్‌లైన్‌ను అత్యవసర వేళల్లో వాడుతున్నాం.

సమస్య : పట్టణంలో పందులతో ఇబ్బంది పడుతున్నాం.

– సోహెల్, తిప్పాపూర్

కమిషనర్ : ఇటీవలే కుక్కలను పట్టణం నుంచి తరలించాం. మళ్లీ పెరుగుతున్నాయి. త్వరలోనే కుక్కలు, పందులను దూర ప్రాంతాలకు తరలిస్తాం.

సమస్య : డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ఫాగింగ్ చేయడం లేదు.

– అబ్దుల్ జబ్బార్, కాలేజీరోడ్డు

కమిషనర్ : ఒక్కో రోజు రెండు వార్డుల చొప్పున ఫాగింగ్ చేయిస్తున్నాం. మరో ఫాగింగ్ మిషన్ తీసుకుని కాలనీల్లో తిప్పిస్తాం.

సమస్య : ఇళ్ల ముందే మురికినీరు నిలుస్తోంది.

– అనిల్, వైద్యులు, వేములవాడ

కమిషనర్ : శానిటేషన్ సిబ్బందిని పంపించి మురికినీరు నిల్వ ఉండకుండా చూస్తాం.

వార్డుల్లో తిరిగి చూస్తా..

- పారిశుధ్య పనులు చేయిస్తా
- సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఆయాజ్
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రానికి వచ్చిన స్వచ్ఛకీర్తికి తగ్గట్టుగా అన్ని వార్డుల్లో పారిశుధ్యం పనులు పారదర్శకంగా చేపట్టాలని.. వార్డుల్లోకి వచ్చి చూస్తానని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ సిబ్బందిని ఆదేశించారు. డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణ, ప్రజా ఆరోగ్యంపై 'సాక్షి' చేపట్టిన ఫోన్ ఇన్‌లో ఆయన నేరుగా ప్రజలతో మాట్లాడారు. సంబంధిత విభాగాల అధికారులకు వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన..కమిషనర్ సమాధానాలు ఇలా ఉన్నాయి..

సమస్య : దోమలమందు కొట్టడం లేదు. ఇంటి పరిసరాల్లో మురికి కూపాలతో ఇబ్బందిగా ఉంటుంది? వీధి దీపాలు పెట్టించండి ? గట్లపై గడ్డి పెరిగింది.

– మురళి, అలుగునూరి ఎల్లయ్య, బైతి వేణుగోపాల్, సురేష్, యాదయ్య

కమిషనర్: నిత్యం ఫాగింగ్ మిషన్‌ను తిప్పుతున్నాం. రొటేషన్ పద్ధతిలో రెండు వార్డులకు ఒక రోజు ఫాగింగ్ చేయిస్తున్నాం. మోరీల్లో ఆయిల్‌బాల్స్ కూడా వేయిస్తున్నాం. ప్రతి రోజు డ్రెయినేజీలు క్లీన్ చేయిస్తాం. వర్షాకాలంలో శానిటేషన్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, వర్షం నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటాం.

సమస్య : వినాయక మండపాల వద్ద శానిటేషన్ చర్యలు చేపట్టాలి. మోరీల్లో సిల్టు పేరుకుపోయింది. ఇళ్ల నుంచి చెత్త సేకరించడం లేదు. సఫాయిలు రావడం లేదు. పిచ్చి గడ్డి మొక్కలు తీయించాలి.

– బియ్యంకార్ శ్రీనివాస్, సమీరా సుల్తానా, బైతి వేణుగోపాల్‌రావు

కమిషనర్: వినాయక మండపాల వద్ద బ్లీచింగ్ చల్లమని ఆదేశించాం. ఉత్సవ నిర్వాహకులు కూడా ఏదైనా కార్యక్రమం చేపడితే చెత్తసేకరణ కోసం మాకు సమాచారం ఇవ్వండి. విద్యానగర్‌లో సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయి. పారిశుధ్య సిబ్బందిని పంపించి డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం. ప్రతి రోజు మోరీలు తీయించడంతోపాటు రోడ్లను శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరిస్తాం.

సమస్య : ఓపెన్ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పాములు వస్తున్నాయి. వీధికుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది. నల్లానీరు రావడం లేదు.

– గుండ్లపెల్లి సంధ్య, గౌస్, మహ్మద్ జహీరొద్దీన్, షేక్ జమీద్, రమేశ్‌రావు

కమిషనర్ : జిల్లా కేంద్రంలో సుమారు 200కు పైగా ఓపెన్ ప్లాట్లను గుర్తించాం. యజమానులకు నోటీసులు పంపించాం. కోతులపై ఫారెస్ట్ అధికారులకు లెటర్ రాశాం. కుక్కల బెడద తప్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతాం. ఇళ్ల మధ్యలో పిచ్చిచెట్లు, గడ్డి, తీసేయిస్తాం. షెడ్యూల్ ప్రకారం నల్లా నీరు సరఫరా అవుతోంది.

సమస్య : మోరీల్లో ఆస్పత్రిలో పడేసిన మందుల డబ్బాలు, సీసాలు వేస్తుండ్రు. చికెన్ వ్యర్థాలు వాహనం పై నుంచి రోడ్డుపై పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

– ప్రశాంత్‌గౌడ్–సర్దాపూర్, షేక్ జమీద్, శ్రీనివాస్‌గౌడ్

కమిషనర్: మోరీల్లో చెత్తను వేయొద్దు. ఇంటింటా చెత్తసేకరణ వాహనాలకు మాత్రమే ఇవ్వాలి. బహిరంగ ప్రదేశాల్లో వేస్తే కేసులు నమోదు చేస్తాం. చికెన్ వ్యర్థాలు పడేసే వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటాం. ఎవరైన వ్యర్థాలను రోడ్లపై పడేస్తే సమాచారం ఇవ్వండి. ఎలాంటి సమస్య అయినా.. నేరుగా నాకు ఫిర్యాదు చేయొచ్చు. మా సిబ్బంది పనితీరు బాగుండేలా చర్యలు తీసుకుంటాం.

సమస్య: డ్రెయినేజీ మంజూరైనా పనులు చేయడం లేదు. సిల్టు తీయమని చెబితే శానిటేషన్ ఆఫీసర్ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. వార్డులు విజిట్ చేయండి.

– గిరి, 9వ వార్డు, బొల్గం నాగరాజుగౌడ్–కౌన్సిలర్, కలికోట శంకర్

కమిషనర్: పట్టణంలోని వార్డుల్లో మంజూరైన డ్రెయినేజీ పనులు ప్రారంభమయ్యాయి. మొదలుకాని చోట్ల ప్రారంభిస్తాం. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులపై సమీక్షించి మెరుగైన సేవలందిస్తాం. వార్డులను విజిట్ చేస్తాను.

రాజన్న నిధులు నిలిపివేత

వేములవాడ: కామారెడ్డి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి రాజన్న నిధులు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కితీసుకుంది. అక్కడి ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నుంచి రూ.10కోట్లు వినియోగించుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేములవాడ బంద్ విరమణ

రాజన్న నిధుల మళ్లింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో శనివారం నిర్వహించ తలపెట్టిన వేములవాడ బంద్‌ను విరమించుకుంటున్నట్లు జేఏసీ నాయకులు ఆది శ్రీనివాస్, ప్రతాప రామకృష్ణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్ ప్రకటించారు. శనివారం ఉదయం 11 గంటలకు రాజన్న ఆలయం వద్ద విజయోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.



లండన్‌లో గణేశ్ నిమజ్జనోత్సవం

వేములవాడ: లండన్‌లోని కోవెంటరీలో ప్రవాస తెలంగాణవాసులు గణేశ్ నిమజ్జనోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుమన్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, సింధు, భరత్‌రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్



సిరిసిల్ల: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అక్క రాజు శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. సెప్టెంబరు 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అయిన శ్రీనివాస్‌ను జయంతి కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలి



పూజలు చేస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతులు సుఖసంతోషాలతో ఉండి వారి జీవితాల్లో వెలుగులు నిండేలా ఏకదంతుడు ఆశీర్వదించాలని కోరుకున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఎల్లారెడ్డిపేటలోని మార్కండేయ ఆలయంలో కొలువుదీరిన వినాయకుడిని శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆగయ్య మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని కోరినట్లు చెప్పారు. నాయకులు వనం రమేశ్, వనం రాజు, దోమల భాస్కర్, శ్రీరామ్ సుదర్శన్, సుంకి భాస్కర్, గాజుల దేవదాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. మండంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన బత్తుల కృష్ణకుమార్ అనుమతులు లేకుండా పికప్ వాహనంలో ఇసుకను కామారెడ్డికి తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాన్ని తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేశారు. కృష్ణకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కారు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల శివారులో శుక్రవారం కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు. కళ్యాణలక్ష్మి గార్డెన్స్ సమీపంలోని యూటర్న్ వద్ద సిగ్నల్స్ వేయకుండా కారు మలుపుతుండగా అగ్రహారంలో జేఎన్‌టీయూ విద్యార్థుల బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యార్థులు పసుల అజిత్, మాదవేని రజనీకాంత్ గాయపడ్డారు. రజనీ కాంత్‌కు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ తరలించారు. అజిత్ సిరిసిల్లలో చికిత్స తీసుకుంటున్నాడు. తోటి విద్యార్థి ఆశీష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్న సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

'స్పౌజ్' దుర్వినియోగంపై విద్యాశాఖ ఫైర్!

- టీచర్ల అక్రమ బదిలీల ఫిర్యాదులపై ఆరా
- ఆప్షన్లు పరిశీలించాలని డీఈవోలకు ఆదేశాలు
- చర్యలు తీసుకోవాలన్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన
- టీచర్ల బదిలీల్లో అక్రమాలను వెలికితీసిన 'సాక్షి' దినపత్రిక



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గవర్నమెంట్ హెడ్‌మాస్టర్ (జీహెచ్‌ఎం) బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై విద్యాశాఖ స్పందించింది. దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లు అయి బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసేందుకు వారికి ప్రత్యేకంగా 10 పాయింట్లు కేటాయించింది. ఈ పాయింట్లు ప్రత్యేకంగా వినియోగించుకుని స్పౌజ్ టీచర్లంతా ఒకే చోట పనిచేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. కానీ... ప్రభుత్వ ఉద్దేశానికి తూట్లు పొడుస్తూ చాలా మంది జీహెచ్‌ఎంలు వారి భార్య/భర్త వద్దకు కాకుండా తమకు నచ్చిన చోటుకు బదిలీ కోసం ఈ పాయింట్లను వాడుతున్నారు. ఈ విషయాన్ని ఈనెల 20వ తేదీన 'సార్లూ.. ఇది తగునా' శీర్షికన పలువురు జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా చేసుకున్న దరఖాస్తుల తీరును 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై నాన్‌స్పౌజ్ టీచర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు సాక్షి కథనం రేపిన దుమారంపై జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లోని డీఈవోలు అప్రమత్తమయ్యారు. జీహెచ్‌ఎంలు ని బంధనలకు విరుద్ధంగా చేసుకున్న ఆప్షన్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన దృష్టికి తీసుకెళ్లారు.

చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

కేంద్ర, రాష్ట్ర, లోకల్‌బాడీల్లోని భార్యభర్తలైన టీచర్లు ఒకే చోట పనిచేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పది పాయింట్ల విధానాన్ని తీసుకొచ్చింది. అయితే పలు చోట్ల అక్రమాలు జరుగుతున్నాయన్న 'సాక్షి' కథనంపై స్పందించిన దేవసేన రాష్ట్రంలోని అన్ని డీఈవో కార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఇప్పటి వరకు చేసుకున్న జీహెచ్‌ఎం దరఖాస్తుల్లోని ఆప్షన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వారిలో భార్య లేదా భర్త పనిచేస్తున్న చోటుకు కాకుండా దూరంగా దరఖాస్తు చేసుకున్నా.. పాయింట్లను దుర్వినియోగం చేసిన వారిని గుర్తించి వెంటనే వారికి కేటాయించిన 10 పాయింట్లు రద్దు చేయాలని, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు.

ఎందుకు దుర్వినియోగం?

- కేవలం జిల్లా కేంద్రాల్లో నివసించాలని, తమ పిల్లలకు మంచి విద్య, వైద్యం అందాలన్న ఆలోచనలతో చాలా మంది స్పౌజ్ టీచర్లు భార్య/భర్తకు దూరంగా ఉన్న పాఠశాలను ఆప్షన్‌గా ఎంచుకుంటున్నారు.
- స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగానికి అధిక హెచ్‌ఆర్‌ఏ మరో కారణమని నాన్‌స్పౌజ్ టీచర్లు ఆరోపిస్తున్నారు. అర్బన్, సెమీఅర్బన్, రూరల్ ప్రాంతాల్లో వచ్చే హెచ్‌ఆర్‌ఏ విషయంలో వ్యత్యాసాల కారణంగా స్పౌజ్ టీచర్లంతా తప్పుదారి పడుతున్నారని మండిపడుతున్నారు.
- కాంప్లెక్స్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి రావడం ఇబ్బందిగా భావిస్తున్నారు. కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు బిల్స్ నిర్వహణ, వేతనాలు చెల్లింపు, సెలవుల పట్టీ, సర్వీసు పుస్తకాల రికార్డుల నిర్వహణ తదితర కారణాలతో పని ఎగ్గొట్టేందుకు వీరు కాంప్లెక్స్ పాఠశాలలను ఎంచుకోకుండా మరో చోటుకు వెళ్తున్నారు.
- భార్య/భర్త జీహెచ్‌ఎంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసేందుకు స్పౌజ్‌లు ఇబ్బంది పడుతున్నారు. తమ భర్త/భార్య ఆదేశాలు పాటించడం ఇష్టంలేని వారు అవే పాయింట్లు వినియోగించుకుని స్పౌజ్‌కు దూరంగా వెళ్తున్నారు.

గీతకార్మికులు ఆర్థికంగా బలపడాలి



మొక్కలు నాటుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మరుగుజ్జు తాటి చెట్ల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గీతకార్మికులు ఆర్థికంగా బలపడాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటతోపాటు మండలంలోని రాజన్నపేటలో శుక్రవారం స్థానిక ఎల్లమ్మగుడి వద్ద మరుగుజ్జు తాటి మొక్కలు నాటారు. ఆగయ్య మాట్లాడుతూ నాణ్యమైన గీతకార్మికులు లబ్ధి పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీహార్, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి మరుగుజ్జు తాటి చెట్లను సేకరించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల విత్తనాలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సాధారణ తాటిచెట్లు 20 ఏళ్లలోపు గీతకొస్తే, మరుగుజ్జు చెట్లు ఏడేళ్లకే వస్తాయని తెలిపారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్, సర్పంచ్ ముక్క శంకర్, నాయకులు అందే సుభాశ్, కొండ రమేశ్, నర్సింలు, ఎడ్ల లక్ష్మణ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- సహజ మరణంగా చిత్రీకరించిన భర్త
- బంధువుల అనుమానంతో వెలుగుచూసిన వైనం
- భర్తను చితకబాదిన బంధువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కేన్సర్‌తో బాధపడుతున్న మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కేన్సర్ నాలుగో స్టేజీలో ఉన్న భార్యకు విముక్తి కలిగించాలనుకున్నాడో.. లేక అడ్డు తొలగించుకోవాలనుకున్నాడో తెలియని స్థితిలో ఆమె మాత్రం మృతిచెందింది. ఎస్సై శేఖర్, గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని గూడూరుకు చెందిన కొత్తపల్లి నాగమణి(45) గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. భర్త ఆంజనేయులు బంధువులకు సమాచారం అందించాడు. నాగమణి కేన్సర్‌తో మృతిచెందిందని తెలిపాడు. శుక్రవారం నాగమణి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. మెడచుట్టూ కమిలిపోయి ఉండడాన్ని బంధువులు గమనించారు. అనుమానం వచ్చి ఆంజనేయులును నిలదీశారు. ఏం జరిగిందో చెప్పాలని దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆంజనేయులును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. భర్తే హత్య చేసి కేన్సర్‌తో మృతిచెందినట్లు అందరిని నమ్మించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. నాగమణి, ఆంజనేయులు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, వారికి పెండ్లిళ్లు చేసి అత్తారింటికి పంపించారు. దంపతులు ఇద్దరు మాత్రమే ఇంట్లో ఉంటుండగా.. నాగమణి చాలా ఏళ్లుగా కేన్సర్‌తో బాధపడుతోంది. నాగమణి సోదరుడు చేపూరి సత్తయ్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖైరతాబాద్ గణేశునికి 86 ఫీట్ల కండువా



సిరిసిల్ల: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ గణేశునికి సిరిసిల్ల నేతన్న 86 ఫీట్ల భారీ కండువాను శుక్రవారం బహూకరించారు. సిరిసిల్లకు చెందిన గుంటుక కోటేశ్వర్ 86 ఫీట్ల కండువాను ఖైరతాబాద్ వినాయకుని భారీ విగ్రహానికి వేసేలా మగ్గంపై నేశారు. ఈ కండువాపై ఒక వైపు ఓంకారం, రెండో వైపు స్వస్తిక్ గుర్తులను సిల్వర్ జరీదారంతో నేశారు. ఆ కండువాను హైదరాబాద్‌కు వెళ్లి మండప నిర్వాహకులకు అందించారు. ఏటా ఇదే విధంగా నేసిన కండువాను దేవుడికి అందిస్తున్నట్లు కోటేశ్వర్ తెలిపారు.

గడప..గడపకూ కాంగ్రెస్



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గడప..గడపకు వెళ్లి ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లను గ్యారంటీ కార్డును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రైతులకు రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్, మహిళలకు ప్రియాంకగాంధీ డిక్లరేషన్, ఎస్సీలకు మల్లికార్జున్‌ఖర్గే డిక్లరేషన్ ప్రజలకు వివరించాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, నాయకులు సూడిద రాజేందర్, బీపేట రాజు, సంతోష్, చెన్నిబాబు, కొత్తపల్లి దేవయ్య, రఫీక్, వంగ మల్లారెడ్డి, గంట బుచ్చాగౌడ్ పాల్గొన్నారు.

నలిమెల, విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం



పురస్కారాలు అందుకున్న నలిమెల భాస్కర్, విమలక్క

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌కు చెందిన పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిలింభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, అరుణోదయ కళాకారిణి విమలక్కకు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ నలిమెల భాస్కర్ నలభై ఏళ్లుగా తెలంగాణ భాష సేద్యం చేస్తున్నారని, ఆయనకు ఈ పురస్కారం రావడం మనందరికి దక్కినట్లేనన్నారు. నల్లరేగడి నేలలో ఎర్రని పాటలు పాడి.. ప్రజల మెదళ్లలో కొత్త ఆలోచనలను మొలకెత్తించే గొప్ప కార్యాన్ని చేపట్టిన విమలక్కకు ఈ అవార్డు దక్కడం గొప్ప విషయమని కొనియాడారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ట్రస్ట్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవిచంద్ర, ఉపాధ్యక్షుడు అశోక్, కవులు అన్నవరం దేవేందర్, పీఎస్ రవీంద్ర, మాడిశెట్టి గోపాల్, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): మోడల్‌స్కూళ్లలో పదేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని నామాపూర్ మోడల్‌స్కూల్‌ను శుక్రవారం టీపీటీఎఫ్ నాయకులు సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్దకాలంగా ఒకే స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయ నాయకులు హన్మంత్‌రెడ్డి, ఒలాద్రి ఎల్లారెడ్డి, మధుసూదన్, అక్కల రమేశ్, రాజిరెడ్డి, వేముల శ్రీనివాస్, అబ్బతిని రమేశ్, దరిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



బాలరాజుపల్లి వృద్ధులకు ఆరు పథకాలపై వివరిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: ఇరువై ఐదేళ్లుగా మీ మధ్యనే.. మీ వాడిగా ఉంటున్న తనకు ఒక్క అవకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆరు పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా ఈ ప్రాంతాన్ని పట్టించుకోకుండా పట్టణాల్లో ఉండేవాళ్లు మళ్లీ స్వచ్ఛంద సంస్థల పేరుతో ప్రజల వద్దకు వస్తున్నారని విమర్శించారు. అలాంటి వారిని నమ్మొద్దని కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన దాదాపు 200 మందికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, ఎంపీటీసీ బొడ్డు శంకరమ్మ, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రొండి రాజు, మాజీ సర్పంచ్ బండ శ్రీనివాస్, వంగ మల్లేశం, ఎల్లాగౌడ్, సీనియర్ నాయకులు బొడ్డు నారాయణ, ఎడపెల్లి అనిల్, యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు రోమాల జగదీశ్వర్, భాస్కర్, పొత్తూరి సంపత్, రాజు, ప్రభాకర్, గోపాల్, మల్లేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివంగాలపల్లిలో చిరుత సంచారం

- సంఘటన స్థలాన్ని సందర్శించిన అటవీ అధికారులు



శివంగాలపల్లిలో చిరుతపిల్ల

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లి శివారులో చిరుతపిల్లల సంచారం కలకలం రేపింది. అటవీ అధికారులు తెలిపిన వివరాలు. శివంగాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ ఎదుట డంపింగ్‌యార్డు వద్ద ఓ చిరుతపులి శుక్రవారం తెల్లవారుజామున ప్రసవమైంది. రెండు చిరుత పిల్లలకు జన్మనివ్వగా.. ఒక పిల్లను తీసుకుని వెళ్లింది. మరో పిల్లను అక్కడే వదిలి వెళ్లడంతో కూన అరుపులు సమీపంలో ఉన్న రైతు మధు చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాసరావు, ఎఫ్‌ఎస్‌వో బాపురాజు చేరుకుని చిరుతపిల్లను తీసుకెళ్లకుండా అక్కడే ఉంచి నిఘా ఏర్పాటు చేశారు. ఎఫ్‌ఎస్‌వో బాపురాజు మాట్లాడుతూ చిరుతపిల్ల తప్పనిసరిగా తల్లిదగ్గరికే వెళ్లాలని, పిల్ల కోసం తల్లి మళ్లీ వస్తుందన్నారు. ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని, నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంపద వనాలతో పచ్చదనం



మాన్వాడ సంపదవనం

బోయినపల్లి(చొప్పదండి): ఖాళీ స్థలాల్లో సంపద వనాల కింద మొక్కల పెంపకం చేపడితే పచ్చదనంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డీఆర్డీవో నక్క శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మాన్వాడ, కొత్తపేట, నీలోజిపల్లి, కొదురుపాక గ్రామాల్లో శుక్రవారం సంపదవనాల పనులు, కంపోస్టుషెడ్ల వినియోగం, పల్లెప్రకృతి వనాలు సందర్శించారు. సర్పంచ్ రామిడి శ్రీనివాస్, ఎంపీవో గంగాతిలక్, ఈజీఎస్ ఏపీవో వనం సబిత, టీఏలు ప్రవీణ్, గంగాజల, పంచాయతీ కార్యదర్శులు రాజశ్రీ, స్వప్న, అంజలి ఉన్నారు.

టౌన్‌ప్లానర్ అధికారి అంటూ బెదిరించిన విలేకరిపై కేసు

వేములవాడ: తాను మున్సిపల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారిని అంటూ, ఓ పత్రికకు జర్నలిస్టును అంటూ బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 21న సిరిసిల్లకు చెందిన కావేటి ప్రవీణ్ వేములవాడలో తాజ్ రెస్టారెంట్‌లోకి వెళ్లి తాను టౌన్ ప్లానర్‌నని, తనకు రూ.5వేలు, బిర్యాని ఇవ్వాలని హుకూం జారీ చేశాడు. లేకుంటే హోటల్‌పై రైడ్ చేయిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే హోటల్ నిర్వాహకుడు అస్లాం 100కు డయల్ చేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కేసు నమోదు చేసినట్లు వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అధికారుల పేరిట బెదిరించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దద్దరిల్లిన సిరిసిల్ల



కలెక్టరేట్ ముందు ఎమ్మార్పీస్ ధర్నా..

- ధర్నాలు.. రాస్తారోకోలు

సిరిసిల్లటౌన్: కౌన్సిలర్లకు లంచం ఇవ్వలేదనే తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాకుండా చేశారని మహిళలు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ తీసిన తర్వాత మున్సిపల్ ముందు బైఠాయించారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ వచ్చి ఆందోళన విరమించాలని కోరగా ససేమిరా అన్నారు. అరెస్టు చేస్తుండగా ఇరువర్గాల మధ్య తోపులాటలు జరిగాయి.

దీక్షల్లోనే అంగన్‌వాడీలు

డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఆర్డీవో ఆఫీస్ ముందు చేపడుతున్న దీక్షలు 12వ రోజుకు చేరాయి. బీజేపీ రాష్ట్ర నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.



దీక్షలో మధ్యాహ్న భోజన కార్మికులు

పర్మినెంట్ చేయండి

తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. మధ్యాహ్న కార్మికులకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు సంఘీభావం, బీజేపీ రాష్ట్ర నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఖానాపురం లక్ష్మణ్, సుంకపాక దామోదర్, నేదురు నర్సయ్య, మేక చంద్రశేఖర్, ఎలగందుల భిక్షపతి, ఆవునూరు తిరుపతి పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



రాజన్న నిధులు రూ.5కోట్లు కామారెడ్డి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించడాన్ని బీజేపీ నేతలు విమర్శించారు. ఈమేరకు అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, శ్రీగాథ మైసయ్య, శిరస్వాల్ కైలాస్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం.. విధిగా వేయాలి

- స్వీప్ నోడల్ అధికారి నర్సింహులు



మాట్లాడుతున్న కె.నర్సింహులు

సిరిసిల్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధమని, ఓటుహక్కును విధిగా వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి కూర నర్సింహులు పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా సమాఖ్యలో మహిళా సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఓటు హక్కు వినియోగంపై ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నికల రోజు ఓటు వేయాలని సూచించారు. దూరప్రాంతాల్లోని వారు, ఇతర ప్రాంతాల్లో చదువుకునే వారు విధిగా ఎన్నికల రోజు వచ్చి ఓటు వేసేలా చూడాలని మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. మహిళలు ఓటుహక్కుపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. డీఆర్‌డీఏ ఏపీడీ రవికుమార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి కల్పన, సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.